క్లుప్తంగా

క్రీడా దుస్తులు, స్పోర్ట్స్ షూలు పంపిణీ


క్రీడా దుస్తులు, షూలు అందిస్తున్న సిరి ఫౌండేషన్ ప్రతినిధులు

కె.కోటపాడు : చదువుతో పాటు క్రీడల్లోను విద్యార్థులు రాణించాలని సిరి ఫౌండేషన్ ప్రతినిధులు నూర్రెడ్డి బాబూరావు, ఎల్.వి.నారాయణరావు అన్నారు. ఎ.కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గల 62 మంది విద్యార్థులకు క్రీడా దుస్తులు, 30 మందికి షూలను ఫౌండేషన్ ద్వారా సమకూర్చారు. హెచ్ఎం ఎ.శేఖర్ సమక్షంలో వీటిని శుక్రవారం విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిరి ఫౌండేషన్ వాలంటీర్ లెక్కల మధు, ఫిజికల్ డైరెక్టర్లు చిట్టి ప్రసాద్, తమ్మునాయుడు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలని నిర్వాసితుల వినతి


తహసీల్దార్ వెంకటరమణకు వినతిపత్రం ఇస్తున్న కొత్తపాలెం నిర్వాసితులు

మాకవరపాలెం: ఆన్‌రాక్ భూ సేకరణ సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కొత్తపాలెం నిర్వాసితులు కోరారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. పునరావాస గ్రామమైన కొత్తపాలెంలో రెండు రోజులుగా రెవెన్యూ సిబ్బంది సర్వే చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రెండు రోజుల నుంచి సర్వే సిబ్బందిని నిర్వాసితులు అడ్డుకుంటున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం నిర్వాసితులు తహసీల్దార్‌ను కలిసి భూ సేకరణ సమయంలో తమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. అప్పటివరకు తమ గ్రామంలో సర్వే నిలిపివేయాలని కోరారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

గొలుగొండ: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు తెలిపారు. గొలుగొండలో నిర్వహించిన పోషణ్ మహోత్సవాల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలంటే ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ ఐసీడీఎస్ సెక్టార్ పీవో శ్రీగౌరి, వైఎస్సార్‌సీపీ మాజీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, ఏపీవో కరుణాకరణ్, స్థానిక సర్పంచ్ కసిపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ వనరులపై అవగాహన అవసరం

చీడికాడ: గ్రామాల్లో ఆదాయ వనరులను గుర్తించడంలో సర్పంచ్‌లకు అవగాహన అవసరమని ఎంపీడీవో హేమ సుందరరావు అన్నారు.శుక్రవారం ఓన్ సోర్స్ రెవెన్యూపై రెండురోజుల శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నిధుల కోసం ఎదురు చూడకుండా గ్రామంలో లభించే ఆదాయ వనరులను గుర్తించ గలిగితే తమ పంచాయతీలను తామే ఉత్తమంగా నిర్వహించుకోవచ్చునన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు,సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రోలుగుంట: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్పంచ్‌లు, పంచాయతీకార్యదర్శులకు శుక్రవారం పంచాయతీ పాలన, వనరుల అభివృద్ధిపై ఎంపీడీవో విస్.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వనరులను సమకూర్చుకోవడం, వాటి వినియోగం, వార్షిక కార్యాచరణ ప్రణాళిక రూప కల్పన తదితర అంశాలపై రిసోర్స్ పర్సన్లు కుమార్, హెప్సీబా శిక్షణ ఇచ్చారు.

నాతవరం: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. మొదట రోజు శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ శిక్షణ తరగతుల్లో చెప్పిన విషయాలు కచ్చితంగా గ్రామాల్లో అమలు చేసినప్పుడే ఆశయం నేరవేరుతుందన్నారు.

బాలికల సాధికారతకు కృషి


బహుమతులు అందజేస్తున్న జెడ్పీటీసీ రమణమ్మ

నర్సీపట్నం:బాలికల సాధికారతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని జెడ్పీటీసీ సుకల రమణమ్మ అన్నారు. మండల పరిషత్ కార్యాల య సమావేశ మందిరంలో నిర్వహించిన కిశోర వికాసం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనంతరం సీడీపీవో జి.వి.రమణి మాట్లాడుతూ లింగవివక్షను రూపుమాపేందుకు కృషి చేస్తున్నామన్నారు. వ్యాసరచన, సాంస్కృతిక ప్రదర్శనలు, క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎంపీడీవో ఉషాశ్రీ, ఎంఈవో తలుపులు, డాక్టర్ దివ్య పాల్గొన్నారు.


మాకవరపాలెంలో వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు


కె.కోటపాడు హైస్కూల్‌లో కబడ్డీ పోటీలో తలపడుతున్న క్రీడాకారిణులు


దేవరాపల్లిలో హోరా హోరీగా సాగుతున్న బాలుర కబడ్డీ పోటీ

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

ఉత్సాహంగా మండలస్థాయి ఆటల పోటీలు


రావికమతంలో క్రీడా కారులతో పీటీలు


సీతయ్యపేటలో ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

దేవరాపల్లి: విద్యార్థినీవిద్యార్థులు విద్యతో పాటు క్రీడలపై దృష్టి సారించి రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని స్థానిక ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి జెడ్పీటీసీ కర్రి సత్యం అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడాపోటీలను ప్రారంభించారు. అండర్-14, అండర్-17 బాలురు, బాలికల విభాగంలో జరిగిన క్రీడా పోటీలను స్థానిక సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మతో కలిసి ఎంపీపీ, జెడ్పీటీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారంతా వాలీబాల్ ఆడి క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. శుక్రవారం బాలురకు పలు పోటీలు నిర్వహించగా, శనివారం బాలికలకు నిర్వహిస్తామని ఇన్‌చార్జ్ మండల విద్యాశాఖ అధికారి-1, ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్. ఉమ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, తెనుగుపూడి గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ ఎస్.విక్టర్‌పాల్, పీడీలు పాల్గొన్నారు.

రావికమతం: స్థానిక హైస్కూల్‌లో మండల స్థాయి క్రీడా పోటీలు శుక్రవారం ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలను ఎంపీడీవో మహేష్,ఎంఈవో-2 బ్రహ్మాజీ,సర్పంచ్ మంగ మోదినాయుడు, ఎంపీటీసీ లక్ష్మీనాగేశ్వరరావు ప్రారంభించారు. ప్రతిభ చూపిన 120 మందిని నియోజవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కె.ధనంజయరావు చెప్పారు.

చీడికాడ: మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో మేలు చేస్తాయని ఎంపీపీ కురచా జయమ్మ అన్నారు.శుక్రవారం మండలంలోని జేబీపురం ఉన్నత పాఠశాలలో మండలస్థాయి క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధికి క్రీడలు దోహంచేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొల్లవిల్లి చిన్నమ్ములు,వైస్ఎంపీపీలు ధర్మిశెట్టి స్వాతి, కొండబాబు,ఎంపీడీవో హేమసుందరరావు,ఎంఈవోలు రమణ,బొంజుబాబు, హెచ్ఎం వరాహమూర్తి, పాల్గొన్నారు.

రోలుగుంట: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి క్రీడాపోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పోతల లక్ష్మీ రమణమ్మతో కలసి ఎంఈవో జగ్గారావు ప్రారంభించారు. హెచ్.ఎం.శేషగిరిరావు, జెడ్పీ ఉన్నత పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలస్థాయి ఆటల పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం బాలికలకు అండర్-14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బేస్‌బాల్, బ్యాడ్మింటన్, యోగా పోటీలను నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు హెచ్ఎం పద్మావతి తెలిపారు. కార్యక్రమంలో వ్యాయాయ ఉపాధ్యాయులు ఆర్.లక్ష్మి, కె.చిట్టి ప్రసాద్, స్వామినాయుడు, కె.ఈశ్వరరావు, రామకృష్ణ, ఎం.మురళీకృష్ణ పాల్గొన్నారు.

నాతవరం: విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు కూడా ముఖ్యమని జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స అన్నారు.స్థానిక హైస్కూల్‌లో శుక్రవారం మండల స్థాయి ఆటలు పోటీలను ఎంఈవో కామిరెడ్డి వరహాలబాబు ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆటలు ఆడటం ద్వారా విద్యార్థులు ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. ఈకార్యక్రమంలో నాతవరం సర్పంచ్ గొలగాని రాణీ, తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కె.సత్యనారాయణ వైఎస్సార్‌సీపీ మేధావుల సంఘం మండల శాఖ అధ్యక్షుడు పైల పోతురాజు, మాజీ ఎంపీపీ పారుపల్లి కొండబాబు, నాతవరం హైస్కూల్ హెచ్ఎం కూంద్రపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట: క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు తెలిపారు. మండలంలోని సీతయ్యపేట హైస్కూలులో శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ డి.నాగేశ్వరీదేవి తదితరులు పాల్గొన్నారు. సీతయ్యపేట పాఠశాల హెచ్ఎం సురేష్ , పీఈటీ బాలగణపతి ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించారు.

మాకవరపాలెం: మండలస్థాయి ఆటల పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన పోటీలను ఎంపీపీ రుత్తల సర్వేశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మన్ మాధవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలన్నారు. అనంతరం వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, యోగా, చెస్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. మాకవరపాలెం, జి.కోడూరు, బూరుగుపాలెం, గిడుతూరు ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారు జోనల్‌స్థాయి పోటీల్లో పాల్గొంటారని పీఈటీ రవి తెలిపారు. స్థానిక ఉన్నత పాఠశాలలో 22 మంది విద్యార్థులకు ఉప సర్పంచ్ లాలం రాము సొంత నగదుతో క్రీడా దుస్తులు అందించారు. తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీవో ఛాయాసుధ, వైస్ ఎంపీపీ రుత్తల లక్ష్మి, హెచ్ఎం నారాయణరావు పాల్గొన్నారు.

ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

మాడుగుల రూరల్: మండలంలో ఈ నెల 23 వ తేదీ నుంచి 30 వ తేదీ వరకు పలు గ్రామాల్లో నిర్వహించనున్న ప్రత్యేక ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎంపీడీవో కొంకి అప్పారావు శుక్రవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో కోరారు. ఈ నెల 23 వ తేదీన కింతలి, కె.జె.పురం హైస్కూళ్లలో, 24న గాదిరాయి, జి.అగ్రహారం హైస్కూళ్లలో, 25 న వీరనారాయణం జిల్లా పరిషత్ హైస్కూల్‌తో పాటు నర్సయ్యపేట గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలో, 27, 28, తేదీల్లో ఒమ్మలి, మాడుగుల(బాలుర) హైస్కూళ్లలో, 29 న సురవరం బాలికల పాఠశాల, మాడుగుల బాలికల హైస్కూల్‌లో, 30 న తాటిపర్తి గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల, ఎం. కోడూరు హైస్కూల్‌లో ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

బీఎన్ రోడ్డును పూర్తిస్థాయిలో నిర్మించాలి


భారీ గొయ్యి వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

రోలుగుంట: గోతులు పూడ్చే పనులు వద్దని, భీమిలి -నర్సీపట్నం రోడ్డును పూర్తిస్థాయిలో నిర్మించి, ప్రమాదాలను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రోలుగుంటలో సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గోతులు పూడ్చించే పనులు తప్ప ఏ విధమైన నిర్మాణ పనులు చేపట్టడం లేదన్నారు. పూడ్చిన గోతులు వర్షాలకు మళ్లీ యథాతథంగా మారుతున్నాయని, వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారని చెప్పారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రోడ్డుపై బైఠాయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లాకార్యదర్శి ఇ.చిరంజీవి, సీపీఎం నాయకుడు కొర్రా కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

‘సాక్షి’పై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి


మాడుగుల పోలీసు స్టేషన్‌లో సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న మాడుగుల విలేకరులు

నర్సీపట్నం: సాక్షి దినపత్రికపై కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు మానుకోవాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి సీహెచ్.బి.ఎల్.స్వామి డిమాండ్ చేశారు. సాక్షిపై ప్రభుత్వ దాడులను నిరసిస్తూ ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టులు ఆర్డీవో కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన తెలియజేశారు. సాక్షి పై పోలీసుల దాడులు మానుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ కల్తీ మద్యంపై వాస్తవ కథనాలను ప్రచురిస్తున్న సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి, సిబ్బందిని విచారణ పేరుతో పోలీసులు వేధించడం సరికాదన్నారు. విచారణ పేరుతో 170 ప్రశ్నలు సంధించడం అన్యాయమన్నారు. ఎడిటర్‌ను వేధింపులకు గురిచేసేలా కేసులు నమోదు చేసి, విచారణకు రావాలని పోలీసులు నోటీసులు జారీ చేయటం దారుణమన్నారు. ప్రభుత్వంపై వ్యతిరేక వార్తలు రాసినంత మాత్రాన పత్రికా సంపాదకులు, విలేకర్లపై ప్రభుత్వం కక్షపూరిత చర్యలకు పూనుకోవడం ప్రజాస్వామ్యంపై దాడిగా అభివర్ణించారు. ప్రభుత్వ చర్యలను ముక్తకంఠంతో ఖండిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎ.డి.బాబు, నర్సీపట్నం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఎస్.నానాజీ, ఎల్రక్టానిక్ మీడియా అసోసియేషన్ అధ్యక్షులు విజయ్, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు సత్యనారాయణ, యూనియన్ నాయకులు పసుపులేటి ప్రభాకర్, ముమ్మారెడ్డి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల: సాక్షి దినపత్రికపై కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు మానుకోవాలని ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు రొబ్బా శ్రీనివాస్, కార్యవర్గ సభ్యుడు ఏలూరు సురేష్ డిమాండ్ చేశారు. సాక్షిపై ప్రభుత్వ దాడులను నిరసిస్తూ ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో రైటర్ మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి పై అక్రమ కేసులు పెట్టడడం తగదని, సాక్షి యాజమాన్యం మీద కక్ష సాధింపు చర్యలను ప్రభుత్వం మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక విలేకరులు కె. నారాయణరావు, బుద్దా జగ్గారావు, తాకాశీ శ్రీను, ధర్మిశెట్టి పైడినాయుడు, తేటకల్ల జనార్ధన్, కె. భవానీ శంకర్ పాల్గొన్నారు. అనంతరం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఉప తహసీల్దారు ఎం. రాజాకు వినతిపత్రం అందజేశారు.

మాజీ ఎమ్మెల్యే గణేష్‌కు సన్మానం


మాజీ ఎమ్మెల్యే గణేష్‌ను సన్మానిస్తున్న వివిధ విభాగాల అధ్యక్షులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

నర్సీపట్నం: వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల కమిటీల అధ్యక్షులుగా నియమితులైన వారు మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల నియమితులైన మేధావుల విభాగం అధ్యక్షుడు కుంద్రాపు తాతబాబు, మండల బూత్ కమిటీ అధ్యక్షుడు పైల తాతాజీ, మాకవరపాలెం మండలం బూత్ కమిటీ అధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్ మాజీ ఎమ్మెల్యేను దుశ్శాలువాతో సన్మానించి, కృతజ్ఞతలు తెలిపారు. అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలని ఈ సందర్భంగా గణేష్ వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం, మాకవరపాలెం ఎంపీపీలు సుర్ల రాజేశ్వరి, రుత్తల సర్వేశ్వరరావు, నియోజకవర్గ బూత్ ఇన్‌చార్జ్ సుర్ల చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ మాకవరపాలెం మండల అధ్యక్షుడు చిటికెల రమణ, సీనియర్ నాయకులు పెట్ల భద్రాచలం, మాజీ పీఏసీఎస్ చైర్మన్ పాశపు నాగేశ్వరరావు, మండల యూత్ అధ్యక్షుడు రుత్తల రాజుబాబు, బీసీసెల్ అధ్యక్షుడు ఇటంశెట్టి శ్రీను, మొండికండి బాబు తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడి చేసిన

వ్యక్తిని తక్షణమే అరెస్టు చేయాలి


దేవరాపల్లిలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మార్పీస్ నాయకులు


మాడుగులలో ఉప తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మార్పీస్ కార్యకర్తలు


నర్సీపట్నంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీస్ నాయకులు


కె.కోటపాడులో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

దేవరాపల్లి: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్ గవాయ్‌పై దాడి చేసిన వ్యక్తిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. రైవాడ అతిథి గృహం నుంచి ర్యాలీగా స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి, తహసీల్దార్ పి.లక్ష్మీదేవికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎలుసూరి గాటీ, ఎమ్మార్పీఎస్ నాయుకులు ఎలుసూరి అప్పారావు, దేవుపల్లి పైడిరాజు, ఎలుసూరి సాగర్‌కుమార్, బల్లంకి మధు, సతీష్, జీవరత్నం, గోపి, ఎర్రయ్య,ఈశ్వరరావు,వీర్రాజు,పాలిబాబు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయ్‌పై దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేయాలని స్థానిక ఎంఆర్‌పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఉప తహసీల్దార్ రాజాకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోర్తా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ సీనియర్ నాయకులు ఎం.ఎం.దాసు తదితరులు మాట్లాడారు. ఎంఆర్‌పీఎస్ మండల కార్యదర్శి పి. శ్రీను, నాయకులు చిన్ని అప్పారావు, అప్పారావు, మహేశ్, పవన్, స్వామి, అరణ్, సూరిబాబు పాల్గొన్నారు.

నర్సీపట్నం: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బి.ఆర్.గవాయ్‌పై దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఎంఆర్‌పీఎస్(ఎంఎస్‌పీ) అనుబంధ సంఘాల నాయకులు తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. జిల్లా ఇన్‌చార్జి పి.వెంకట్రావు, నియోజకవర్గ ఇన్‌చార్జి మారుడుపూటి సతీష్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేయటం దారుణమన్నారు. అనంతరం తహసీల్దార్ రామారావుకు వినతిపత్రం అందజేశారు.

కె.కోటపాడు : సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బి.ఆర్. గవాయ్‌పై దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ మండలశాఖ అధ్యక్షుడు ఎన్.దేముడు డిమాండ్ చేశారు. ఈమేరకు స్థానిక తహసీల్దార్ భుజంగరావుకు శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, కనితి శ్రీనివాసరావు, కనితి రమణ, కోరువాడ నారాయణరావు, రావాడ త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

వరిలో తెగుళ్ల పట్ల అప్రమత్తం

దేవరాపల్లి: వరిలో తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని చెరకు పరిశోధన కేంద్ర శాస్త్రవేత్తలు ఆదిలక్ష్మి, చంద్రశేఖర్, ఉమా మహేశ్వరరావు సూచించారు. నాగయ్యపేట,కాశీపురం,రైవాడ,దేవరాపల్లి గ్రామాల్లో స్థానిక మండల వ్యవసాయ అధికారి ఎల్.వై. కాంతమ్మతో కలిసి శాస్త్రవేత్తలు శుక్రవారం పర్యటించి, పలు గ్రామాల్లో వరి పొలాల్లో సుడిదోమ, ఆకు ముడత, పొడ తెగులు, పొటాష్ లోపం లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. వీటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు సమగ్రంగా అవగాహన కల్పించారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


వడ్డాది కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో పుస్తకాలు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు

బుచ్చెయ్యపేట: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు తెలిపారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాసోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. వడ్డాది కస్తూర్బా బాలికల పాఠశాలలో జరిగిన ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలు పుస్తకాలు, పెన్నులను జెడ్పీటీసీ రాంబాబు, మండల వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి చేతుల మీదుగా అందజేశారు.

ఘనంగా అయ్యప్ప పడి పూజ


అయ్యప్ప స్వామిని ఊరేగింపుగా తీసుకెళుతున్న భక్తులు

రావికమతం: మండలంలోని దొండపూడిలో అయ్యప్ప స్వామి దివ్య పడి పూజ మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన వెంకటరమణ,కుమారులు రాజు,స్వామి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన దివ్య పడి పూజను,తోట శివ శంకరరావు గురుస్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

వెంకన్న ఆలయంలో ప్రత్యేక పూజలు

మాడుగుల రూరల్: రమా ఏకాదశి పర్వదినం సందర్భంగా కె.జె.పురం జంక్షన్‌లోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. కె.జె.పురం సీతారామ స్వామి ఆలయంలో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు భజన నిర్వహించారు.

గ్రామాభివృద్ధికి ప్రజలు సహకరించాలి


బోయిలకింతాడ గ్రామ సభలో మాట్లాడుతున్న సర్పంచ్ బాబూరావు

దేవరాపల్లి: గ్రామాల అభివృద్ధికి ప్రజలు సహాయ సహకారాలు అందించాలని బోయిలకింతాడ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు కోరారు.పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అధ్యక్షతన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు కోసం గ్రామ సభ, గ్రామ పంచాయతీ సాధారణ గ్రామ సభను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి వేతనదారులందరికీ పని కల్పించేలా అవసరమైన ఉపాధి పనులు గుర్తించాలని అధికారులకు సర్పంచ్ సూచించారు. గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలపై గ్రామస్తులతో చర్చించారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శి కె.అర్జున్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు అన్నం సాంబమూర్తి, బొబ్బిలి రాము, కోన శ్రీను, కొప్పాక శంకరరావు, అన్నం శంకరరావు, కొమర బాబురావు, కడిమి నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.